# నమస్తే తెలంగాణ
# రాజన్న సిరిసిల్ల

5 | కరీంనగర్, గురువారం 1 మే 2025 | RAJANNA SIRCILLA


## కృష్ణవేణి టాలెంట్ స్కూల్ సత్తా

వేములవాడ, ఏప్రిల్ 30 : పదో తరగతి ఫలితాల్లో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని పాఠశాల డైరెక్టర్ శ్రీ సన్నిధి వెంకటకృష్ణ తెలిపారు. బొప్ప భార్గవి 581, కనపర్తి సింధూరి 580 మార్కులు సాధించారని చెప్పారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సత్కరించారు.




ఉత్తమ మారులు సాధించిన విద్యార్థులతో కలిసి విజయం సంకేతం చూపుతున్న కృష్ణవేణి టాలెంట్ స్కూల్ డైరెక్టర్ శ్రీ సన్నిధి వెంకటకృష్ణ, ఉపాధ్యాయులు




ఇంగ్లీష్ యూనియన్ హై స్కూల్ విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్

## ఇంగ్లిష్ యూనియన్ హవా

తెలంగాణ చౌక్, ఏప్రిల్ 30 : పదో తరగతి ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని ఇంగ్లిష్ యూనియన్ హై స్కూల్ విద్యార్థులు అత్యుత్తమైన ప్రతిభ చూపి మొదటి స్థానంలో నిలిచారు. ఈ మేరకు విద్యార్థులను కలెక్టర్ సందీప్‌కుమార్ ఝూ బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాలలోని 27మంది విద్యార్థులకు 25మంది విద్యార్థులు 500కు పైగా మార్కులు సాధించారని కరస్పాండెంట్ రాజుకుమార్ తెలిపారు. రష్మిత అనే విద్యార్థిని 584మార్కులతో మొదటిస్థానంలో నిలించిందని హర్షం వ్యక్తం చేశారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించడంపై సంతోషం వ్యక్తంచేశారు.

# ‘సెస్’లో సోలార్ వెలుగులు

- సొంతంగా పవర్‌ప్లాంట్ ఏర్పాటు దిశగా సంస్థ
- వ్యవసాయ, పరిశ్రమల రంగాలకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రయత్నం

**ట్రాన్స్‌కో నుంచి విద్యుత్ కొనుగోలు చేస్తున్న సెస్ సంస్థ ఇక నుంచి సొంతంగా తయారు చేసుకోవడంపై దృష్టి సారించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, జర్మనీ కో-ఆపరేటివ్ బ్యాంకు సహకారంతో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నది. ఇటీవల సిరిసిల్లను సందర్శించిన జర్మనీ ప్రతినిధి బృందం ఇచ్చిన నివేదికతో సాకారం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నది.**



సిరిసిల్ల సహకార విద్యుత్ సంస్థ కార్యాలయం ముందు జర్మని ప్రతినిధి బృందంతో పాలకవర్గం (ఫైల్)

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 30 (నమస్తే తెలంగాణ) : విద్యుత్ సరఫరాలో వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తూ అంతర్జాతీయ గుర్తింపు పొందిన సిరిసిల్ల సహకార విద్యుత్ సంస్థ (సెస్) నూతన ఒరవడి సృష్టించబోతున్నది. సొంతంగా విద్యుత్ తయారీ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్న ఆకాంక్షతో రెండు దశాబ్ధాల కిందటే కార్యాచరణ చేపట్టింది. అయితే, సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడుతూ వచ్చింది. కాగా, సోలార్ విద్యుత్‌ను సద్వినియోగం చేసుకునేలా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి సోలార్ ప్యానెల్‌ను పెట్టుకునేలా సబ్సిడీ ఇచ్చి ప్రోత్సహిస్తున్నది. ప్రస్తుతం సోలార్ విద్యుత్ వినియోగానికి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో సెస్ సొంతంగా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయాలన్న నిర్ణయానికి వచ్చింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60 శాతం, జర్మనీ కోఆపరేటివ్ బ్యాంకు 25 శాతం, వినియోగదారుల వాటాధనం 15 శాతం నిధులతో సొంత కరెంటు తయారీకి అడుగులు పడుతున్నాయి.

### రోజుకు 100 మెగావాట్ల ఉత్పత్తికి అంచనా

సోలార్ పవర్ ప్లాంట్‌తో రోజుకు వంద మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేలా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ట్రాన్స్‌కో నుంచి యూనిట్ విద్యుత్ ₹4.87లకు కొనుగోలు చేస్తుండగా, రామగుండం నుంచి సిరిసిల్ల వరకు వస్తున్న విద్యుత్‌లో 10 మెగావాట్ల లైన్ లాస్ భారం సెస్‌పై పడుతున్నది. సొంతంగా ఏర్పాటు చేసుకోబోతున్న సోలార్ పవర్‌ప్లాంట్ వల్ల 10 మెగావాట్ల విద్యుత్ లైన్‌లాస్ ఉండదు. పైగా యూనిట్ విద్యుత్ ₹3.30కే లభించే అవకాశం ఉంది. తద్వారా వినియోగదారుడిపై కొంత భారం కూడ తగ్గే అవకాశం ఉన్నది. సోలార్ వపర్‌ప్లాంట్ ఏర్పాటుతో సెస్‌పరిధిలోని వ్యవసాయ రంగం, మరమగ్గాల పరిశ్రమ, రైసు మిల్లులు, ఇతర రంగాలకు నాణ్యమైన కరెంటు సరఫరా అయ్యే అవకాశముంటుంది. ఇప్పటికే రెండుగ్రామాలకొకటి చొప్పున 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేసింది. ఇంకా కొన్ని చోట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించింది.

### మరమగ్గాలకు రాయితీ

వస్త్ర పరిశ్రమకు కేంద్ర బిందువైన సిరిసిల్లలోని మరమగ్గాలకు ప్రభుత్వం 10 హెచ్‌పీ వరకు విద్యుత్ రాయితీ ఇస్తున్నది. పరిశ్రమను సంక్షోభం నుంచి గట్టెక్కించాలంటే ఈ రాయితీని 25 హెచ్‌పీలకు పెంచాలని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు ఈఆర్‌సీకి విన్నవించడంతో పరిశీలించి 25 హెచ్‌పీలకు రాయితీ పొడిగించింది. ఫలితంగా సుమారు 30 వేల మరమగ్గాల యజమానులు, ఆసాములకు లబ్ధి చేకూరింది. సోలార్ పవర్‌ప్లాంట్ ఏర్పాటుతో మరమగ్గాలకు మరింత లాభదాయకం కానున్నట్లు అధికారులు తెలిపారు.

### సోలార్‌తో వినియోగదారులకు లాభం



నాణ్యమైన విద్యుత్ సరఫరాతో వినియోగదారులకు మెరుగైన సేవలందించాలన్నది మా పాలకవర్గ లక్ష్యం. వ్యవసాయ, మరమగ్గాలు, ఇతర పరిశ్రమల రంగాలను ప్రోత్సహించేందుకు అడిగిన వెంటనే విద్యుత్ కనెక్షన్లు ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం. ప్రస్తుతం ట్రాన్స్‌కో నుంచి విద్యుత్ కొనుగోలు చేస్తున్నాం. సోలార్ పవర్ ప్లాంట్ సొంతంగా సంస్థ నుంచి ఏర్పాటుకు ప్రతిపాదనలు చేస్తున్నాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60 శాతం, జర్మనీ కోఆపరేటివ్ బ్యాంకు 25 శాతం,15 శాతం వినియోగదారుల వాటాధనంతో ఏర్పాటు చేసేందుకు పాలకవర్గ సభ్యులందరం కలిసికట్టుగా అడుగులు వేస్తున్నాం. వినియోగదారులకు సోలార్ పవర్ మరింత చౌకగా లభించే అవకాశాలున్నందున ఆ దిశగా ప్రయత్నిస్తున్నాం.

**- చిక్కాల రామారావు, సెస్ చైర్మన్**

# భూ భారతి వేదికపై రగడ

- ఏఎంసీ చైర్‌పర్సన్ భర్తకు సీటివ్వడంపై అభ్యంతరం
- సొంత పార్టీ కార్యకర్తే మండిపాటు



ఏఎంసీ చైర్మన్ సాబేరా బేగం భర్త గౌస్‌కు మాట్లాడేందుకు మైక్ అందిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 30: అధికారిక వేదికపై ఏఎంసీ చైర్‌పర్సన్ భర్త గౌస్ కూర్చోవడంపై సొంత పార్టీ కార్యకర్త నుంచే అసహనం వ్యక్తమైంది. వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో భూభారతి నూతన ఆర్‌వోఆర్ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభమైన తర్వాత కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా అదే వేదికపై చివరగా కూర్చున్న ఏఎంసీ చైర్‌పర్సన్ షేక్ సాబేరా బేగం భర్త గౌస్‌ను చూసి మైక్‌ను అందించి మాట్లాడాలని సూచించారు. అధికారికంగా ఏ పదవి లేని కాంగ్రెస్ పార్టీ నాయకుడిని వేదికపై కూర్చోబెట్టడంపై మరో కాంగ్రెస్ నాయకుడు పందిల్ల లింగంగౌడ్ అసహనం వ్యక్తం చేశాడు. వేదిక ముందు కూర్చున్న బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాట నర్సయ్య వద్దకు వెళ్లి తీవ్ర అభ్యంతరం తెలిపాడు. అధికారిక వేదికపై కూర్చోబెట్టడమేమిటని, ప్రొటోకాల్ విషయంలో పార్టీ తప్పు చేస్తున్నదని నిలదీశాడు. దీంతో నర్సయ్య కొద్ది సేపు లింగంగౌడ్‌కు నచ్చజెప్పి, శాంతింపజేశాడు. అయినా వినకుండా భవిష్యత్తులో ఇలాగే చేస్తే వేదికపైనే నిలదీస్తామని హెచ్చరించాడు.








